

వలస బతుకుల్లో వెలుగులు

ఇన్నాళ్లూ చేపల వేటకు గుజరాత్ పయనమవుతున్న మత్స్యకారులు ప్రభుత్వ ప్రోత్సాహంతో వలసలకు స్వస్తి చెప్పారు. 8లో



ఎన్టీఆర్ సింహ గాయత్రం

ఎన్టీఆర్ సింహ గాయత్రం పుస్తకాన్ని తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి ఏయూలో ఆవిష్కరించారు. 8లో



శునక 'షో'యగం

విశాఖ: ప్రభుత్వ వెటర్నరీ ఆస్పత్రి ఆవరణలో జూనోసిస్ డే సందర్భంగా గురువారం పెంపుడు జంతువులు సందడి చేశాయి.

న్యూస్‌రీల్

మేయర్ అహ్మదాబాద్ పయనం



దాబాగార్డెన్స్ (విశాఖ): జీ-20 సదస్సులో భాగంగా అహ్మదాబాద్‌లో గురువారం నుంచి మూడు రోజుల పాటు మేయర్ల సదస్సు (యూ-20 మేయర్ల సమ్మిట్ సెషన్) జరగనుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గురువారం బయలుదేరి వెళ్లారు. తొలి రోజు స్వాగత సదస్సు, వివిధ కార్యక్రమాలుంటాయని, ఈ సదస్సులో పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను మేయర్ డెలిగేట్స్‌కు వివరించనున్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన ఢిల్లీ బృందం



సిరసపల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఆనంద్‌యాదవ్

అనకాపల్లిటౌన్ : ఢిల్లీ నేషనల్ హెల్త్ స్టిమ్ రిసోర్స్ సెంటర్(ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ) బృందం వైద్యులు గురువారం జిల్లాలో తంతడి, పరవాడ, సిరసపల్లి, తగరంపూడి పీహెచ్‌సీలను సందర్శించారు. నలుగురు వైద్యులు గల బృందం అధికారి డాక్టర్ ఆనంద్‌యాదవ్ ఆసుపత్రుల్లో రికార్డులను, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ రిపోర్టులను అమరావతికి, ఢిల్లీ రిసోర్స్ సెంటర్‌కు అందజేస్తామని ఆనంద్‌యాదవ్ చెప్పారు. జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి మణికంఠ, పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ బస్ పాస్‌లకు ఆన్‌లైన్లో నమోదు చేసుకోండి

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో రెగ్యులర్‌గా చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఆర్టీసీ బస్‌పాస్‌లు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ ఎస్.సుజాత గురువారం ప్రకటనలో తెలిపారు. 12 సంవత్సరాల లోపు వయసున్న బాలురు, పదో తరగతి లోపు బాలికలకు ఉచితంగా బస్‌పాస్‌లు అందిస్తామన్నారు. ఈ మేరకు విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పాస్ తీసుకునే సమయంలో దరఖాస్తు రుసుం రూ.50లు చెల్లించాల్సి ఉంటుంది.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

అనకాపల్లిటౌన్: జిల్లాలో జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు(నేషనల్ అవార్డు-2023) దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ వరకూ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు తమ పూర్తి వివరాలను nationalawardstoteachers.education.gov.in లో నమోదుచేసుకోవాల్సిందిగా సూచించారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇందిరా భారతి

నర్సీపట్నం: నర్సీపట్నం ఇన్‌చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇందిరా భారతి బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా నర్సీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ యుగంధర్‌కు శ్రీకాకుళం జిల్లా టెక్కలి బదిలీ అయింది. ఈయన స్థానంలో అనకాపల్లి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఇందిరా భారతిని నర్సీపట్నం ఇన్‌చార్జిగా నియమించడంతో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

లాలం భాస్కరరావు మృతి



లాలం భాస్కరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్

రాంబిల్లి : జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని భర్త, మాజీ ఎంపీపీ లాలం భాస్కరరావు (65) గురువారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భాస్కరరావు మృతదేహాన్ని స్వగ్రామం లాలంకోడూరుకు తరలించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యేలు యూవీ రమణమూర్తిరాజు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌తో పాటు వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, అభిమానులు తరలివచ్చి భాస్కరరావు మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బోధనలో సరికొత్త అడుగులు..

డిజిటల్ చదువులు

అభివృద్ధి చెందుతున్న సాంకేతికతతో విద్యా బోధనలో సరికొత్త అడుగులు పడుతున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా విద్య అందించేలా నూతన విధానాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుద్దముక్కలతో వినియోగించే బ్లాక్, గ్రీన్ బోర్డుల ద్వారా చేసే బోధనకు స్వస్తి చెప్పి డిజిటల్ విధానంలో విద్య అందించేందుకు సన్నద్ధం అవుతోంది. ఇందుకుగాను ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) విధానాన్ని తీసుకువచ్చింది. త్వరలో ప్రారంభమయ్యే ఈ విధానంపై ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ మొదలుపెట్టారు.

- ఐఎఫ్‌పీ విధానానికి ప్రభుత్వం శ్రీకారం
- సుద్దముక్కలకు ఇక స్వస్తి
- నాడు-నేడులో అభివృద్ధి చేసిన 14 పాఠశాలల్లో అమలు
- ఆరు-పది తరగతి గదుల్లో ఇప్పటికే 167 ప్యానెల్స్ ఏర్పాటు
- ఐఎఫ్‌పీ బోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ



ఐఎఫ్‌పీ అమలుతో కనుమరుగుకానున్న గ్రీన్ బోర్డు



డిజిటల్ బోర్డుపై ఉపాధ్యాయులకు శిక్షణ

మాకవరపాలెం: సర్కారు బడుల్లో విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుసాగుతోంది. ఇప్పటికే ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ టీవీలతో డిజిటల్ క్లాస్ రూం (డీసీఆర్) ద్వారా బోధన అందించింది. దీనికి భిన్నంగా త్వరలో సరికొత్త విధానంలో విద్యా బోధన సాగించేందుకు నిర్ణయించింది. ఎక్కడాలేని విధంగా ఆధునిక సాంకేతికతతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) విధానాన్ని తీసుకువచ్చింది. జిల్లాలో మొదటి విడతగా నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేసిన 14 ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

బ్లాక్, గ్రీన్ బోర్డులకు స్వస్తి

పాఠశాలల్లో ఇప్పటివరకు బ్లాక్, గ్రీన్ బోర్డులపై సుద్దముక్కలతోనే విద్యా బోధన సాగుతోంది. విద్యార్థులకు ఏ పాఠం బోధించాలన్నా ఉపాధ్యాయులు కచ్చితంగా బోర్డులపై సుద్దముక్కలతో రాయాల్సిందే. అయితే ఇకపై డిజిటల్ బోధనలో భాగంగా నూతన విధానం ఐఎఫ్‌పీ అమల్లోకి వస్తే పాత పద్ధతులకు స్వస్తి పలికినట్టే. ఆరు నుంచి పది వరకు తరగతులు నిర్వహించే ప్రతి గదిలోనూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే జిల్లాలో 14 పాఠశాలల్లో 167 ప్యానెల్స్ ఇన్‌స్టాల్ చేశారు.

ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ బోధనపై ప్రత్యేక శిక్షణ

త్వరలో ప్రారంభం కానున్న ఐఎఫ్‌పీ బోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పది తరగతులు బోధించే ఉపాధ్యాయులకు 15 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేశారు. అనకాపల్లిలోని దాడి ఇంజినీరింగ్ కళాశాల, మాకవరపాలెం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 1 నుంచి ఈ శిక్షణ అందిస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు రెండు రోజుల వంతున జిల్లాలోని 334 పాఠశాలల్లో పనిచేస్తున్న 5,688 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

ఐఎఫ్‌పీ అంటే..

- విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అధునాతన డిజిటల్ విధానంలో బోధన అందించేందుకు తీసుకువచ్చిందే ఈ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ప్రోగ్రాం
- ఐఎఫ్‌పీ ద్వారా విద్యార్థులకు ఎంత క్లిష్టమైన పాఠాలైనా ఇట్టే అర్థమయ్యేలా బోధించవచ్చు.
- ఉపాధ్యాయుడు ఏదైనా కొత్త విషయాన్ని విద్యార్థులకు చెప్పాలంటే గతంలో తమ ఫోన్లో ఆ విషయాన్ని డౌన్‌లోడ్ చేసుకుని బోధించాల్సివచ్చేది. కానీ నూతన విధానంలో ఒక్క క్లిక్‌తో ఈ ప్యానెల్‌పై ప్రపంచంలో ఏముందో చూపించవచ్చు.
- గణితం, సైన్స్ బోధించే సమయంలో కొన్ని చిత్రాలు బోర్డులపై గీస్తూ బోధన చేయాల్సివచ్చేది. కానీ ఈ ప్యానెల్‌పై త్రిభుజాలు, చతుర్భుజాలు, మానవ అవయవాలు, తదితర ఏ చిత్రాలైనా ఇట్టే చూపించవచ్చు.
- మ్యాప్‌ల ద్వారా చూపించే కొన్ని అంశాలను ఇకపై నేరుగా విద్యార్థులకు వీడియోలు, ఫొటోల ద్వారా చూపించే వీలుంది.

బోధన సులభతరం



నూతన విధానంలో బోధన సులభం అవుతుంది. తక్కువ సమయంలో విద్యార్థులకు ఎక్కువ విషయాలను చెప్పే అవకాశం ఉంది. పాఠాలు విద్యార్థులకు కూడా ఇట్టే అర్థం అవుతాయి. ఐఎఫ్‌పీ విధానం మంచి ఫలితాలను ఇస్తుంది.

-కోసూరు రాము, ఉపాధ్యాయుడు తూటిపాల, మాకవరపాలెం మండలం

డిజిటల్ విద్య అవసరం



మారుతున్న విద్యా విధానంలో విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో అవసరం. ఐఎఫ్‌పీ ద్వారా బోధనతో సరికొత్త విధానానికి ప్రభుత్వం నాంది పలికింది. దేశంలోనే అత్యుత్తమ విద్య అందించేందుకు తీసుకువస్తున్న డిజిటల్ విద్యా విధానం అభినందనీయం.

-కె.వెంకటరావు, ఐఎఫ్‌పీ ట్రైనర్

శిక్షణ పూర్తికాగానే ప్రారంభం



జిల్లాలో రెండు చోట్ల ఐఎఫ్‌పీపై శిక్షణ అందిస్తున్నాం. అది పూర్తి కాగానే నూతన విధానంలో బోధన ప్రారంభిస్తాం. ఇప్పటికే 14 పాఠశాలల్లో 167 ప్యానెల్స్ ఇన్‌స్టాల్ చేయడం పూర్తయింది. దశలవారీగా అన్ని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తాం.

-వెంకటలక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి

జగన్ మళ్లీ సీఎం కావాలని

బైక్ యాత్ర



బైక్ మీద వైఎస్సార్‌సీపీ జెండాలతో ప్రచారం చేస్తున్న అదవికొట్టు రాజు

- ప్రభుత్వ పథకాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం

మాడుగుల రూరల్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘన విజయం సాధించాలని కోరుతూ ఆయన అభిమాని అడవి కొట్టు రాజు చేపట్టిన బైక్ యాత్ర గురువారం మాడుగుల మండలం చేరుకుంది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం, అన్నవరం గ్రామానికి చెందిన రాజు మొదటి నుంచి జగన్‌కు వీరాభిమాని. దీంతో రెండోసారీ సీఎంగా జగనే గెలవాలంటూ ఈ ఏడాది మే 14న తన స్వగ్రామం అన్నవరం నుంచి బైక్ యాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర ఇంతవరకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పూర్తి చేసుకుని, మాడుగులలో ప్రవేశించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మాట్లాడుతూ ప్రతి రోజూ తన బైక్ యాత్రలో వేలాది మందిని కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తున్నానని చెప్పారు. తనకు 2021లో కరోనా వ్యాధి సోకడంతో కావలి ప్రభుత్వ ఆస్పత్రి క్వారంటైన్‌లో చేరానని, అప్పట్లో నాణ్యమైన భోజనం, మందులు అందించడం వల్లే తనలాంటి చాలా మంది బతికి బయటపడ్డారని చెప్పారు. 2022లో గుండెపోటు రావడంతో ఒంగోలు కిమ్స్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకుని మరోసారి బతికి బయటపడ్డానన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుని పెద్దేరు జలాశయం వద్ద కలిసి ఆయన అభినందనలు అందుకున్నారు.

పరిశ్రమల్లో ప్రత్యేక రక్షణ చర్యలు



పరిశ్రమల్లో కార్మికుల భద్రతపై సమీక్ష సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- కార్మికుల భద్రతపై కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సమీక్ష

తుమ్మపాల: జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ముందస్తు రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రత, రక్షణ చర్యలపై ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ అధికారులు వారం రోజుల్లో నివేదిక అందించాలన్నారు. జిల్లాలోని 301 పరిశ్రమలలో పారిశ్రామికేతర రంగాలకు చెందిన 95 సంస్థలు మినహా మిగిలిన 206 కర్మాగారాలలో భద్రతకు సంబంధించి అన్ని అంశాలను పరిశీలించి, పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేసీసీ గ్రూప్ ఏర్పాటు చేయాలని సూచించారు. బాయిలర్స్ నిర్వహణపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ స్థాయిలో కూడా భద్రతపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రతి కర్మాగారంలో మాక్‌డ్రిల్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కార్మికుల భద్రత, సంక్షేమంపై యాజమాన్యం దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు ఏయూ ప్రొఫెసర్ల సూచనల్ని తీసుకోవాలని పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికులు ఏ విధంగా స్పందించాలనే విషయమై కార్మికులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కర్మాగారాలకు చెందిన నోడల్ అధికారి, ముఖ్య అధికారుల ఫోన్ నెంబర్లు రెవెన్యూ, పోలీస్, ఫైర్ శాఖల వద్ద ఉండాలన్నారు. ముఖ్యంగా రియాక్టర్ వద్ద పనిచేసే వారు అవసరమైన విద్యార్హతలతోపాటు అనుభవం, నైపుణ్యం కలిగినవారై ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి బుద్ధా మునిస్వామి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు, కాలుష్య నియంత్రణ శాఖ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృత్యు ఒడిలో మరో ఇద్దరు

- ఆరుకు చేరిన ఫార్మా ప్రమాద మృతుల సంఖ్య
- మంటలపాలైన వారంతా ప్రాణాలు కోల్పోయిన వైనం



వారం రోజుల క్రితం సాహితి ఫార్మా కంపెనీలో చెలరేగిన బీభత్సం



మృతుడు నూకినాయుడు కుటుంబ సభ్యులకు తక్షణ సాయం అందిస్తున్న సాహితి ప్రతినిధులు

రాంబిల్లి/మహారాణిపేట (విశాఖ): సాహితి ఫార్మా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలో చికిత్స పొందుతున్న ఇద్దరు కార్మికులు గురువారం కన్నుమూశారు. దీంతో ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య ఆరుకు చేరింది. జూన్ 30న రియాక్టర్లు పేలి ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన రాంబిల్లి మండలానికి చెందిన ఎస్.నూకినాయుడు (48) కేజీహెచ్‌లో, నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సాదిరెడ్డి రాజుబాబు (23) ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షలు చొప్పున ప్రకటించగా, ఫార్మా కంపెనీ యాజమాన్యం మరో 9 లక్షలు ఇవ్వనుంది. నూకినాయుడు కుటుంబసభ్యులకు రూ. లక్ష తక్షణ సాయంతోపాటు పరిహారానికి సంబంధించి రాతపూర్వక హామీ పత్రాన్ని సాహితి ఫార్మా ప్రతినిధులు గురువారం అందజేశారు.

బీభత్సం.. భయానకం

ఆకాశాన్ని తాకేలా ఎగసిపడిన అగ్నికీలలు.. దట్టంగా కమ్ముకున్న పొగ.. భారీ శబ్దాల మధ్య హాహాకారాలు చేస్తూ కార్మికులు పరుగులు తీసిన భయానక దృశ్యం ఇంకా సాహితి ఫార్మా కార్మికులను పీడకలలా వెంటాడుతోంది. జూన్ 30 ఉదయం మంటలు చెలరేగాయి. సమీపంలో ఉన్న రెండు రియాక్టర్లు భారీ శబ్దంతో పేలాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అచ్యుతాపురం మండలం జంగాలపాలేనికి చెందిన పైల సత్తిబాబు, విజయనగరానికి చెందిన తిరుపతిలను విశాఖ కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రాంబిల్లి మండలం పంచదార్లకు చెందిన ఎస్.నూకినాయుడు, భువనేశ్వర్‌కు చెందిన రామేశ్వర్, నక్కపల్లికి చెందిన ఎస్.అప్పారావు, నక్కపల్లి మండలం రేబాకకు చెందిన ఎస్.రాజుబాబులు విశాఖలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఒక్కరొక్కరుగా ప్రాణాలు కోల్పోయారు.

భార్యా పిల్లలు కన్నీరు మున్నీరు

నక్కపల్లి: సాహితి ఫార్మా కంపెనీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సాదిరెడ్డి రాజుబాబు గురువారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీరని విషాదంలో మునిగిపోయారు. అతనికి భార్య కళ, రెండేళ్ల పాప, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు. తల్లి, తండ్రి కూడా రాజుబాబే ఆధారం.

గంజాయి రవాణా.. ఏజెన్సీ టూ మహారాష్ట్ర



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ చిత్రంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ



బుచ్చియ్యపేట ఎస్సై కుమార్‌స్వామికి ప్రశంసా పత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ మురళీకృష్ణ

- గత నెల 30న ఇద్దరికి, ఇపుడు మరో ఇద్దరికి రిమాండ్
- వ్యాన్, రూ.6.16 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

సాక్షి, అనకాపల్లి: ఏజెన్సీలో గంజాయి పండించి లారీల్లో, వ్యాన్‌లలో మహారాష్ట్రకు అక్రమంగా రవాణా చేసే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను గత నెల 30న అరెస్ట్ చేసి వారిని రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరిని గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్ పంపారు. వారి నుంచి రూ.6.16 లక్షల విలువైన 309 కేజీల గంజాయిని, ఒక వ్యాన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మురళీకృష్ణ మీడియాకి వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాపై ముందస్తు సమాచారంతో గత నెల 30న బుచ్చియ్యపేట ఎస్సై కుమార్‌స్వామి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో వడ్డాది నుంచి విజయరామరాజుపేట వేపు వెళ్తున్న ఏపీ 39 టీడీ 5859 నంబర్ గల వ్యాన్‌ను తనిఖీ చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా వ్యాన్ బాడీని ఆనుకుని అనుమానం రాకుండా ఐరెన్‌రేకుతో ఏడు అరలుగా ఏర్పాటు చేసి అందులో సుమారు నాలుగు కేజీల చొప్పున ఒక్కో ప్యాకెట్‌ను తయారీచేసి 77 ప్యాకెట్లను పేర్చారు. దీన్ని గుర్తించిన పోలీసులు వ్యాన్ డ్రైవర్ వంత భగవాన్, చక్రిలను అరెస్ట్ చేసి విచారించారు. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా లమతాపుట్టు బ్లాక్‌లోని నిరికి రఘునాథ్ తన చుట్టుపక్కల ప్రాంతాల్లో గంజాయిని పండించి, పెదబయలు మండలం సోకిల లక్ష్మణరావు ద్వారా మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. భగవాన్, చక్రిలను గత నెల 30నే రిమాండ్‌కి పంపారు. ఈ కేసులో సోకిల లక్ష్మణరావు, నిరికి రఘునాథ్‌ల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి వీరిద్దరినీ అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కొత్తకోట ఇన్‌చార్జి సీఐ ఎ.రవికుమార్, బుచ్చియ్యపేట ఎస్సై కుమార్‌స్వామి, పోలీస్ సిబ్బంది జె.అర్జున్, కె.ఎస్.ఎస్.గణేష్, ఒ.కిరణ్, ఎం.వెంకట్రావ్‌లను ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు పాటుపడాలి



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బొడ్డేడ ప్రసాద్ తదితరులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మునగపాక బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ప్రసాద్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ప్రజల కోసం మెరుగైన సేవలందించారన్నారు. తాను ఉప ప్రధానిగా ఉన్న కాలంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పాటుపడ్డారన్నారు. మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, అరబుపాలెం, మూలపేట సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు, భీశెట్టి గంగప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా మెరుగైన వైద్యం

- జిల్లాలో రూ.10 కోట్లతో పీహెచ్‌సీలకు అదనపు భవనాలు
- 377 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణానికి నిధులు
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమంత్



పీహెచ్‌సీలో రోగుల వివరాలను వైద్యాధికారి నుంచి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

నాతవరం: జిల్లాలో ఏడు పీహెచ్‌సీలలో రూ.10 కోట్లతో అదనపు భవన నిర్మాణాలు చేశామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్ తెలిపారు. నాతవరం పీహెచ్‌సీని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించి, రోగులకు అందించే సేవలపై ఆరా తీశారు. ఈ ప్రాంతంలో అధికంగా పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలను వైద్యాధికారి ప్రసన్నను అడిగి తెలుసుకున్నారు. తర్వాత సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 24 మండలాల్లో 45 పీహెచ్‌సీలు ఉన్నాయన్నారు. రోగుల వసతి సమస్యను దృష్టిలో పెట్టుకుని 7 పీహెచ్‌సీల్లో అదనపు భవనాలను నిర్మించామన్నారు. ఆరు చోట్ల భవనాలను స్వాధీనం చేసుకుని వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఎల్వీ పురం పీహెచ్‌సీ పనులు చివరి దశలో ఉన్నాయని, ఇక్కడి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. 35 పీహెచ్‌సీల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. చాలా చోట్ల పనులు పూర్తి అయినట్టు తెలిపారు. జిల్లాలో 424 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయని వాటిలో 372 కేంద్రాలకు నూతన భవనాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 22 నూతన భవనాలకు ప్రారంభోత్సవం చేశామన్నారు. ఈ నెల 15 నాటికి 100 భవనాల పనులు పూర్తికానున్నట్టు పేర్కొన్నారు. నూతన భవనాలు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతాశయంతో ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ ద్వారా అందుతున్న వైద్య సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. జిల్లాలో 39 వాహనాల ద్వారా వైద్యులు ప్రతి నెల 983 క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా వైద్య సిబ్బంది కొరత లేదన్నారు. గతంలో మలేరియా, డయారియాతో మరణాలు ఉండేవని, ప్రస్తుతం అలాంటి మరణాల్ని నివారించామన్నారు. బీపీ, సుగర్ వ్యాధుల్ని అదుపులో పెట్టేందుకు విరివిగా మందులు అందిస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఎక్కడ కూడా మందులు కొరత లేదన్నారు.

క్లుప్తంగా

సెజ్ రోడ్డుకు ప్రత్యామ్నాయ భూములు పరిశీలించాలి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశం
- కాగిత, అమలాపురంలలో పర్యటన



కాగిత వద్ద రోడ్డు భూసేకరణ వివరాలు తెలుసుకుంటున్న జేసి జాహ్నవి

నక్కపల్లి : మండలంలో తీరప్రాంతం వెంబడి ఏర్పాటు చేసే విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏర్పాటు చేసే ప్రధాన రహదారి నిర్మాణానికి ప్రత్యామ్నాయ భూములు పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె నక్కపల్లి మండలంలో కాగిత, అమలాపురం, మూలపర గ్రామాల్లో పర్యటించారు. జాతీయ రహదారి నుంచి కాగిత మీదుగా చందనాడ ఎస్ఈజెడ్‌కు రోడ్డు నిర్మాణం కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. కాగిత వద్ద రోడ్డు మ్యాప్, భూముల వివరాలు స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు.

30 ఎకరాలు అవసరం

ఈ సందర్భంగా అధికారులు రోడ్డు నిర్మాణం కోసం సుమారు 30 ఎకరాల భూముల అవసరమవుతాయని జేసీకి తెలిపారు. కాగిత, వేంపాడు, పాటిమీద, తమ్మయ్యపేట గ్రామాల పరిధిలో కొన్ని ప్రభుత్వ డీఫారం భూములు కాగా కొన్ని జిరాయితీ భూములు ఉన్నాయన్నారు. జిరాయితీ భూములకు రైతులు ఎకరాకు రూ.70 లక్షలు పైగా డిమాండ్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రూ.50 లక్షలు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిందని, రైతులు అంగీకరించలేదని తెలిపారు. దీనిపై జేసీ మాట్లాడుతూ కేవలం ఒకే మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ భూములు పరిశీలించాలన్నారు. నష్ట పరిహారం ఎక్కువ డిమాండ్ చేస్తున్న సందర్భంలో ఒకే ప్రాంతంలో భూసేకరణ కోసం వేచి వుండే కంటే దగ్గర మార్గాలను కూడా పరిశీలించాలన్నారు. తక్కువ దూరంలో రోడ్డు నిర్మించే ఆలోచన చేస్తే ఎక్కువ భూముల సేకరించాల్సిన అవసరం ఉండదని, ప్రభుత్వంపై భారం తగ్గుతుందని అన్నారు. ప్రత్యామ్నాయ భూములు పరిశీలించి రైతులతో చర్చలు జరిపి నివేదిక సమర్పించాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె ఏపీఐఐసీ సేకరించిన భూములను అమలాపురం, పాటిమీద, వేంపాడు, చందనాడ ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఈమె వెంట అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఆర్డీవో జయరాం, ఏపీఐఐసీ ఎస్డీసీ అనిత, జోనల్ మేనేజర్ త్రినాథరావు, తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్, డిప్యూటీ తహసీల్దార్ నీరజ, ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బోటు కొనుక్కున్నా.. ఇక ఇక్కడే ఉంటా



విజయనగరం జిల్లా తిప్పలవలసకు చెందిన నక్కా అప్పన్న వయసు 55 ఏళ్లు. 2014 నుంచి గుజరాత్‌లోని వీరావల్ హార్బర్‌లో నెలకు రూ.8 వేల జీతానికి చేపల వేట చేస్తున్నాడు. 2018 నవంబర్ 27న వీరి బోట్లు పొరపాటున పాకిస్తాన్ సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. అప్పన్నతో పాటు ఉత్తరాంధ్రకు చెందిన 20 మంది జాలర్లను పాకిస్తాన్ అధికారులు అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 2020 జనవరి 1న వీరంతా విడుదలయ్యారు. సీఎం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ఇకపై గుజరాత్‌కు వలస వెళ్లవద్దని, హార్బర్లు కట్టిస్తానని, ఇక్కడే ఉండి వేట చేసుకోవాలని సూచించారు. ఆ ప్రకారమే హార్బర్ల నిర్మాణం జరుగుతోంది. గుజరాత్‌కు వెళ్లకుండా ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షలతో బోటు కొనుగోలు చేసి స్వగ్రామం తిప్పలవలసలోనే ఉంటూ కొడుకుతో కలిసి సొంతంగా వేట సాగిస్తున్నామని నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు సంపాదిస్తున్నామని అప్పన్న ఆనందంతో చెప్పాడు.



ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సొమ్ముతో కొనుగోలు చేసిన బోటుతో నక్కా అప్పన్న

వలస బతుకుల్లో సర్కారీ వెలుగులు

మూడు దశాబ్దాలుగా చేపల వేటకు గుజరాత్ పయనం

ఉత్తరాంధ్ర నుంచి 20 వేల మంది మత్స్యకారుల వలస	పొరపాటున పాకిస్తాన్ జలాల్లోకి వెళ్లడంతో అరెస్టులు	ఏళ్ల తరబడి జైళ్లలోనే మగ్గాల్సిన దుస్థితి	ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో విడుదల	ప్రభుత్వ నిర్ణయాలతో వలసలకు స్వస్తి	కొత్త హార్బర్లు ఏర్పాటయ్యాక ఏపీలోనే ఉంటామంటున్న జాలర్లు

(బొల్లం కోటేశ్వరరావు, సాక్షి, విశాఖపట్నం)

ఇన్నాళ్లూ ఆ మత్స్యకారులు పొట్టకూటి కోసం రాష్ట్రాలు దాటి వలసలు పోయేవారు. భార్యాపిల్లలను ఇంటి వద్దే వదిలేసి.. ఊహ తెలిసిన కొడుకుల్ని వెంటబెట్టుకుని ఊళ్లొదిలి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్‌కు వలస బాట పట్టేవారు. అక్కడ వారికిచ్చే అరకొర జీతంతోనే బతుకులీడ్చే వారు. ఏడాదిలో 8 నెలలు (ఆగస్టు నుంచి మార్చి వరకు) అక్కడే గడిపేవారు. సముద్రంలో సరిహద్దులు తెలియక చేపల వేట సాగిస్తే పొరుగు దేశంలోని పాకిస్తాన్ జైళ్ల పాలయ్యేవారు. ఏళ్ల తరబడి ఆ జైళ్లలోనే మగ్గేవారు. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు మునుపటిలా గుజరాత్ వెళ్లే ఆలోచన విరమించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వీరి బతుక్కి భరోసానిచ్చే ముఖ్యమంత్రి వచ్చారు. రాష్ట్రంలో కొత్తగా హార్బర్లు, పోర్టుల నిర్మాణాన్ని చేపట్టారు. మత్స్యకారులకు ఉపాధి లభించే మార్గాలను సుగమం చేస్తున్నారు. ఏటా రూ.10 వేల చొప్పున మత్స్యకార భరోసా సొమ్ము కూడా ఇస్తున్నారు. ఇకపై ఎక్కడెక్కడికో వలస పోవాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వేట సాగించే అవకాశాలు కల్పిస్తున్నారు.

ఉత్తరాంధ్ర నుంచి వేలల్లో వలసలు

ఒకప్పుడు చేపల వేట సాగించేందుకు తగిన వనరులేక ఉత్తరాంధ్ర మత్స్యకారులు వేల సంఖ్యలో గుజరాత్‌కు వలస పోయేవారు. ఆ రాష్ట్రంలోని వనక్‌బరా, వీరావల్, పోర్‌బందర్, ఓఖా, మాంగ్‌రోల్ తదితర ఫిషింగ్ హార్బర్ల నుంచి అరేబియా సముద్రంలో వేట సాగించేవారు. అక్కడ వేటకు మత్స్యకారుల కొరత, వారికంటే తక్కువ వేతనానికే మన జాలర్ల లభ్యతతో ఆ ప్రాంత బోటు యజమానులు వీరిని తీసుకెళ్లేవారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.60 వేల అడ్వాన్స్, నెలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల జీతం చెల్లించేలా ఒప్పందం చేసుకుంటారు. అడ్వాన్స్ పోగా మిగతా సొమ్మును 8 నెలల అనంతరం ఇంటికొచ్చే సమయంలో ఇస్తారు. ఇన్నాళ్లూ మన తీరంలో తగినన్ని హార్బర్లు, పోర్టులు లేక గుజరాత్‌లో ఇచ్చే చాలీచాలని జీతానికే ఆశపడి మైనర్ కొడుకులను సైతం వెంటబెట్టుకుని వలస వెళ్లేవారు. వేటకెళ్లిన వారు సముద్రంలో తమకు సరిహద్దులు తెలియక తరచూ పాకిస్తాన్ అధికారులకు చిక్కడం, వారు విడుదలయ్యే మార్గం లేక ఏళ్లకు ఏళ్లు జైళ్లలోనే మగ్గడం పరిపాటైపోయింది. ఒక బోటులో 8 మంది వేట సాగిస్తారు. ఆ ఇరుకు బోటులోనే కాలకృత్యాలు, భోజనం, నిద్ర చేస్తారు. నెలలో రెండుసార్లే ఒడ్డుకు వస్తారు. అనారోగ్యం పాలైనా, చనిపోయినా అంతే సంగతులు. స్వస్థలానికి శవాన్ని తీసుకొచ్చే ఆర్థిక పరిస్థితి లేక అక్కడే అంతిమ సంస్కారాలు పూర్తిచేసి బూడిదను మాత్రమే కుటుంబీకులకు తెస్తారు.

సీఎం నిర్ణయంతో..

ఇలా గుజరాత్‌కు వలస పోతున్న తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశాకిరణంలా మారారని మత్స్యకారులు సంబరపడుతున్నారు. ఇప్పటికే గుజరాత్‌కు వలసలు మానుకున్న ఉత్తరాంధ్ర మత్స్యకారులు కొందరు స్థానికంగానే చేపల వేట సాగిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బుడగట్లపాలెం (శ్రీకాకుళం), పూడిమడక (అనకాపల్లి), ఉప్పాడ (కాకినాడ), మచిలీపట్నం (కృష్ణా), జువ్వలదిన్నె (నెల్లూరు) సహా 8 చోట్ల ఫిషింగ్ హార్బర్లు, మరో 7 చోట్ల ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి గుజరాత్, దక్షిణాది రాష్ట్రాల్లోని హార్బర్లకు వలస వెళ్లే అవసరం, పాక్‌లో జైళ్ల పాలయ్యే పరిస్థితి రాదని ఈ మత్స్యకారులు చెబుతున్నారు.

హార్బర్లలో మూలుగుతున్న బోట్లు

రాష్ట్రం నుంచి గుజరాత్‌కు వలస వెళ్లే మత్స్యకారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో ఆ రాష్ట్రంలోని ప్రధాన హార్బర్లలో బోట్లు మూలుగుతున్నాయి. ఇన్నాళ్లూ కళాసీలుగా పిలిచి ఈ మత్స్యకారులతోనే అక్కడ వ్యాపారులు బోట్లను నడిపేవారు. ఇప్పుడు వీరి కొరతతో వ్యాపారులు/బోటు యజమానులు హార్బర్లలోనే బోట్లను కట్టేశారని, గతంకంటే ఎక్కువ సొమ్ము ఇస్తామని ఆశ చూపినా వెళ్లడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు.

ఆ మత్స్యకారులందరికీ విముక్తి

2018 నవంబర్‌లో పాక్ అధికారులకు చిక్కి జైళ్ల పాలైన 20 మందితో పాటు అంతకుముందు కొన్నేళ్ల నుంచి అక్కడి జైలులో మరో ముగ్గురు జాలర్లు మగ్గుతున్నారు. అప్పటి ప్రభుత్వం వీరి విడుదలకు ప్రయత్నించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని పాక్ జైళ్ల నుంచి వీరికి విముక్తి కల్పించారు. దీంతో ఇప్పుడు పాకిస్తాన్ జైళ్లలో ఒక్క ఆంధ్ర మత్స్యకారుడు కూడా లేకుండా చేశారు.

మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు



ఎన్నో ఏళ్లుగా రాష్ట్రం నుంచి ముఖ్యంగా ఉత్తరాంధ్ర నుంచి గుజరాత్‌కు మత్స్యకారులు పెద్దఎత్తున వలస వెళ్తున్నారు. అక్కడ వారికిచ్చే జీతం తక్కువే అయినా స్థానికంగా ఉపాధి లేక వలస పోవాల్సిన పరిస్థితి. వీరి వలసలకు అడ్డుకట్ట వేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికక్కడ హార్బర్లు కడతానని హామీ ఇచ్చారు. మాట ప్రకారం రూ.3,500 కోట్లతో 8 ఫిషింగ్ హార్బర్లు, 7 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టారు. పైగా పాక్ జైళ్లలో ఉన్న ఆంధ్ర మత్స్యకార్లు విడుదల చేయించారు. దీంతో ఈ ప్రాంతం నుంచి గుజరాత్‌కు వలస వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. సీఎంపై నమ్మకంతో అనేకమంది స్థానికంగా అందుబాటులో ఉన్న చోట నుంచి వేట సాగిస్తున్నారు. ఏపీ మత్స్యకారుల తరఫున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వాసుపల్లి జానకిరామ్, అధ్యక్షుడు, మర పడవల సంఘం, విశాఖపట్నం

ఆలయ అభివృద్ధికి శ్రీవాణి ట్రస్ట్ నిధుల మంజూరు

- సీతారామస్వామి కల్యాణ మండపానికి రూ. కోటి
- వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి రూ. 10 లక్షలు

రోలుగుంట: జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ అభ్యర్థన మేరకు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, అనకాపల్లి జిల్లా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో రోలుగుంట కొండపైనున్న వేంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధి పనులకు రూ. 10 లక్షలు, సీతారామస్వామి వారి దేవస్థానం కల్యాణ మండపానికి రూ. కోటి శ్రీవాణి ట్రస్ట్ తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు మంజూరు అయ్యాయి. శ్రీవాణి ట్రస్ట్ తిరుమల తిరుపతి దేవస్థానం రీజినల్ సూపరింటెండెంట్ విశ్వేశ్వరశర్మ గురువారం ఇక్కడికి వచ్చారు. ఆలయాల అభివృద్ధిపై దేవస్థానం కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణను, అర్చకుడు రేజేటీ సీతారామచార్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కల్యాణ మండపం స్థలాన్ని పరిశీలించారు. టీటీడీ నిధుల నుంచి సీతారామస్వామి వారి కల్యాణ మండపం ఏర్పాటుకు రూ. కోటి, వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 50 లక్షలు ప్రతిపాదన చేయగా తొలి విడతగా రూ. 10 లక్షలు కలిపి రెండింటికీ రూ. కోటీ 10 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. త్వరలో ఈ నిధులతో పనులు ప్రారంభించాలని జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి పోతల లక్ష్మీశ్రీనివాస్‌కు సూచించారు. కార్యక్రమంలో రోలుగుంట పీఏసీఎస్ చైర్‌పర్సన్ మడ్డు తాతబాబు, మండల వైశ్య సంఘం ప్రతినిధి మొగలపల్లి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డికి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రతినిధి పోతల లక్ష్మీ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



కొండపైనున్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన శ్రీవాణి ట్రస్టు తిరుమల తిరుపతి దేవస్థానం రీజనల్ సూపరింటెండెంట్ విశ్వేశ్వరశర్మ

అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యంతో పట్టుబడిన వాహనం. చిత్రంలో విజిలెన్స్ అధికారులు

- రెండు వ్యాన్లలో తరలిస్తున్న 3 టన్నుల బియ్యం
- వాహన యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు

దేవరాపల్లి : దేవరాపల్లి నుంచి రెండు వ్యానుల్లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం ఉదయం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.తిరుపతిరావు, ఎస్ఐ రవికుమార్‌తో కూడిన బృందం బుధవారం రాత్రి దేవరాపల్లికి చేరుకొని బియ్యం బస్తాలు లోడు చేస్తున్న ప్రాంతాల్లో మాటు వేసింది. బియ్యాన్ని తరలిస్తున్న ఒక వ్యాన్‌ని దేవరాపల్లి పెదరాయ సెంటర్‌లోను, మరో వ్యాన్‌ను ఎ. కొత్తపల్లి శివారు సంజీవపురం సమీపంలోను గురువారం ఉదయం పట్టుకున్నారు. ఒక వాహనంలో 23 బస్తాల్లో 1100 కేజీల బియ్యాన్ని, మరో వాహనంలో 45 బస్తాలలో 1900 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలను సీజ్ చేసి దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్రకు అప్పగించారు. పట్టుబడిన 3వేల కేజీల బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారుల సమక్షంలో నిత్యావసర సరుకుల గోదాంకు అప్పగించారు. రెండు వాహనాల యజమానులతో పాటు డ్రైవర్లపైన కేసులు నమోదు చేసినట్టు విజిలెన్స్ సీఐ తిరుపతిరావు తెలిపారు.

ఎన్టీఆర్ సింహగాయత్రం పుస్తకావిష్కరణ

ఏయూక్యాంపస్: తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు నిలుస్తారని తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రంలో ఎన్టీఆర్ సింహగాయత్రం పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలు డి.వి.ఎస్.శర్మ, చల్లా కృష్ణవీర్ అభిషేక్‌లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పదవి కోసం తన ఆశయాలను ఎన్టీఆర్ ఎన్నడూ వదులుకోలేదన్నారు. దైవ సంబంధ పాత్రలకు ఆయన ప్రాణం పోశారన్నారు. ఆయన జీవిత చరిత్రను రెండు సంపుటాలుగా రచించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్టీఆర్‌ను చంపేసిన వారే నేడు దండలు వేస్తున్నారన్నారు. తన రాజకీయ జీవితాన్ని సైతం తొక్కేశారని, తాను రచించిన ఎన్టీఆర్ జీవిత చరిత్ర పుస్తకాలు సైతం బయట అందుబాటులో లేకుండా చేశారన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ యువతకు గాంధీజీ ఆలోచనలు చేరువ చేసే విధంగా కృషిచేస్తున్నామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట : నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన రాజీవ్‌కాలనీ ఎదురుగా రైలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. తుని నుంచి నర్సీపట్నం రోడ్డు వైపు ప్రయాణిస్తున్న రైలు గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఢీ కొట్టిందన్నారు. మృతుని వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చడమైందని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

15 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు



జి.మాడుగులలో గంజాయి నిందితుడుతో సీఐ సత్యనారాయణ, పోలీసులు

జి.మాడుగుల : ఏజెన్సీ ప్రాంతం నుంచి గురువారం బైక్‌పై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు. బుచ్చయ్యపేట మండలం గొర్లిపాలెం గ్రామానికి చెందిన కట్టా కూసలరావు ఏజెన్సీ ప్రాంతంలో 15 కిలోల గంజాయిని కొనుగోలు చేసి బైక్‌పై మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద తనిఖీల్లో పట్టుబడినట్టు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకొన్నామని, కేసు నమోదు చేసి ఏఎస్ఐ చిట్టిబాబు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారావు, హెచ్‌సీ ఆనందరావు, పోలీసు సిబ్బంది చినబాబు, సత్యారావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై నిఘా పెట్టాలి



స్థానిక పోలీసు అధికారులతో మాట్లాడుతున్న నర్సీపట్నం ఏఎస్పీ రాణా

గొలుగొండ : ఏజెన్సీ నుంచి అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిపై పోలీస్ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని నర్సీపట్నం ఏఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశించారు. ఆయన గురువారం కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న భీమవరం చెక్‌పోస్టును పరిశీలించారు. గంజాయి రవాణా నిర్మూలనకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే అన్ని నిఘా ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే కృష్ణదేవిపేట ప్రాంతంలో హైవే పనులను ఏఎస్పీ పరిశీలించారు. పనులు జరుగుతున్నందున ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, ఎస్ఐ ఉపేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జోగమాంబ సేవలు మరువలేనివి



గౌడు జోగమాంబ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సేవకులు

యలమంచిలి : ప్రముఖ సంఘ సంస్కర్త గౌడు జోగమాంబ 59వ వర్ధంతిని ఆమె సేవకులు ఘనంగా నిర్వహించారు. యలమంచిలి పట్టణం భవనం వీధిలో గల రాధాకృష్ణ స్త్రీ సమాజ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో సేవకులు మాట్లాడుతూ గౌడు జోగమాంబ యలమంచిలి పట్టణంలో 80 ఏళ్ల క్రితం మహిళాభ్యున్నతికి పాటు పడ్డారని తెలిపారు. ఎంతో మంది వృద్ధులు, అనాథలు, వితంతువులకు ఉపాధి కల్పించి ఆదుకున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు సేవాభావం అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవకులు బోడపాటి వెంకటలలిత, రమణమూర్తి, గౌరి, లక్ష్మి, నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులపై ఉపాధ్యాయులకు శిక్షణ

అనకాపల్లి టౌన్ : విద్యావ్యవస్థలో (డిజిటల్ తరగతులు) మార్పులు తీసుకు రావడమే కాకుండా ఉపాధ్యాయుల్లో నైపుణ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఐఎఫ్‌పీఎస్ ట్రైనింగ్ జిల్లా నోడల్ అధికారిణి వి. శ్రీలక్ష్మి అన్నారు. జిల్లాలో అనకాపల్లి డైట్, మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉపాధ్యాయులకు డిజిటల్ తరగతులపై ఈనెల 15 వరకూ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. గురువారం స్థానిక డైట్ కళాశాల శిక్షణలో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 334 పాఠశాలల్లో 5,688 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆమె చెప్పారు. డైట్ కళాశాలలో 2,545 మందికి, అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 3,143 మంది ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి రెండు రోజులు శిక్షణ ఇస్తామన్నారు. ఇంట్రాక్ట్ ఫ్లాట్ ప్యానల్ సిస్టమ్ (ఐఎఫ్‌పీఎస్), స్మార్ట్ టీవీలపై విద్యార్థులకు ఏ విధంగా శిక్షణ ఇవ్వాలనే దానిపై ముందుగా ఉపాధ్యాయులకు ఇంజనీరింగ్ ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

గొలగాం పంచాయతీలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని గొలగాం పంచాయతీ పరిధి ఎల్లారమ్మకాలనీ, బీసీ కాలనీ, కొత్తతలారివానిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

పెరిగిన టమాటా, ఉల్లి ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా, ఉల్లి ధరలు పెరిగాయి. అల్లం, పచ్చిమిర్చి ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. గత వారం వరకు కిలో ఉల్లి రూ.20 ఉండగా, ఈ వారం రూ.25 కు పెరిగింది. ఇప్పటికే మెట్టుదిగని టమాటా గత వారం కంటే రూ.50 అదనంగా పెరిగింది. క్రిందటి వారం రూ.100 ఉన్న కిలో టమాటా ధర ఈ వారం రూ.150కి చేరుకుంది. బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, క్యారెట్, బీట్రూట్ రూ.40, బెండకాయ, దొండకాయ, కాకర కాయ, వంకాయ రూ.60, బీరకాయ రూ.80, క్యాప్సికం రూ.100కు విక్రయాలు సాగాయి. పచ్చి మిర్చి రూ.150 నుంచి రూ.120కి తగ్గింది. అల్లం కూడా రూ.250 నుంచి రూ.200కు తగ్గింది.

130 కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు



రేబిస్ టీకాలు వేయించేందుకు పెంపుడు కుక్కలను తీసుకొచ్చిన యజమానులు

అనకాపల్లి రూరల్: ప్రపంచ జూనోసిస్ డే పురస్కరించుకుని గురువారం స్థానిక గాంధీ నగరం ప్రాంతీయ పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. పట్టణ సమీప ప్రాంతాల నుంచి పలువురు యజమానులు పెంపుడు కుక్కలను పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి తీసుకొచ్చారు. మొత్తం 130 కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేసినట్టు అనకాపల్లి పశుసంవర్ధక శాఖ ఏడీ బి.సౌజన్య వెల్లడించారు. ప్రాణాంతక రేబిస్ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రంగి	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
ఇద్దరు	: సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాట్నీ)	
రంగబలి	: షిర్డిసాయి
అశ్విన్స్	: పర్దిసాయి
ఇన్సిడియస్ ద రెడ్ డోర్	: వెంకటేశ్వర
భాగ్ సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 86 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	--	--
మూడోరకం	3,850	3,950

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ నెగెటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగెటివ్-2యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ని సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 329 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రజలకు శ్రీరామరక్ష.. జగనన్న సురక్ష

- ఉచితంగా 11 రకాల ధ్రువపత్రాలు
- ఊరూవాడా యజ్ఞంలా పంపిణీ



లబ్ధిదారునికి సర్టిఫికెట్‌ను అందిస్తున్న దాడి రత్నాకర్, కార్పొరేటర్ నీలిమ

అనకాపల్లిటౌన్ : జగనన్న సురక్ష పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమంలా నిర్వహిస్తున్నామని, పథకంలో 11 రకాలైన సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామాలైన 26, 27 సచివాలయాల పరిధి వల్లూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వివిధ ధ్రువపత్రాల కోసం ఎలాంటి ఇబ్బందులు పడరాదనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన జనన, మరణ, రైస్‌కార్డు, ఆరోగ్యశ్రీ వంటి 11 రకాల సర్టిఫికెట్లు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సహకారంతో సులభంగా అందిస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమానికి పెద్దపీట జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, పెన్షన్‌కానుక, ఆరోగ్యశ్రీ, వంటి వివిధ పథకాలను అర్హులందరూ అందుకునేలా ఈ ధ్రువపత్రాలు ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలను నాడు నేడు పథకంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి రూ.15 వేలు జమ, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్‌ను ప్రోత్సహిస్తూ డిజిటల్ బోర్డుల ఏర్పాటును వివరించారు. డిజిటల్ బోర్డులపై ఉపాధ్యాయులకు డైట్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం 267 మంది దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను కార్పొరేటర్ కొణతాల సునీతతో కలిసి ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ పి.వెంకటరమణ, డీటీ వై.శ్రీరామమూర్తి, ఎంఎస్ఎం డైరెక్టర్ నదియా, సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, జీవీఎంసీ ఆర్ఐ మద్ర శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్లవిల్లి నరసింహరావు, ఎర్ర సింహాద్రి, సిమ్మ మాణిక్యం, అప్పలనాయుడు, కర్రి అప్పాజీ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఖర్చులేకుండా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



మా కుటుంబంలో ఒకరు చనిపోతే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం గత ప్రభుత్వంలో రూ.2 వేలు తీసుకుని నెల రోజుల తరువాత ఇచ్చారు. ఈ సారి వలంటీర్ మా ఇంటిలో జరిగిన సంఘటన తెలుసుకుని జగనన్న సురక్ష కార్యక్రమంలో వివరాలు నమోదు చేశారు. నాలుగురోజుల్లో పైసా ఖర్చు లేకుండా మా ఊర్లోనే సర్టిఫికెట్ ఇవ్వడం ఆనందంగా ఉంది.

– సాలాపు ఈశ్వరరావు, వల్లూరు గ్రామం

ఇంటి వద్దకే కుల ధ్రువీకరణ పత్రం



చదువు, ఉద్యోగం దేనికైనా కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. తహీల్దార్ కార్యాలయానికి వెళ్లాలంటే ఎరుకువానిపాలెం నుంచి అనకాపల్లికి రానూపోనూ 34 కిలో మీటర్లు ప్రయాణించేవాళ్లం. ఇపుడు వలంటీరే మా వద్ద ఆధార్, కులధ్రువీకరణ జెరాక్స్‌లు తీసుకుని, వారం తర్వాత గ్రామసభలో సర్టిఫికెట్ ఇచ్చారు. జగనన్న మేలును ఎప్పటికీ మర్చిపోలేను.

– కొప్పాక సంతోషి, ఎరుకువానిపాలెం

సంక్షేమ సారథిని మళ్లీ ఆశీర్వదించండి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్
- రూ.16.30 లక్షలతో పూర్తయిన అభివృద్ధి పనుల ప్రారంభం



గొలగాం గ్రామంలో తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్



గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వెంట ర్యాలీగా వెళ్తున్న గ్రామప్రజలు

అనకాపల్లిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రజలను కోరారు. మండలంలోని గొలగాం గ్రామంలో గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని కుటుంబాలవారీగా గణాంకాలతో సహా వివరించారు. సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులు మంత్రి వద్ద పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని సాంకేతిక కారణాలవల్ల పథకాలు అందని వారు తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన వారందరికీ సంక్షేమ లబ్ధి అందించాలని అక్కడే ఉన్న అధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోరుబిల్లి నాగరాజుకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని భరోసానిచ్చారు. దివ్యాంగుడైన గొంతిన మోహన్‌సాయికు ప్రభుత్వం 90 శాతం సదరం సర్టిఫికెట్ మంజూరు చేసిందని, 100 శాతం ఇవ్వాలని సాయి తల్లిదండ్రులు మంత్రికి విన్నవించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో గత ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం గురించి ప్రజలను ఆరా తీశారు. జగనన్న పాలనలో తమకు అంతా మంచే జరుగుతోందని, సంక్షేమ పథకాలన్నీ ఇళ్ల వద్దకే వచ్చి అందిస్తున్నారని అంతా ముక్త కంఠంతో మంత్రి వద్ద తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. ప్రభుత్వంపట్ల ప్రజలు చూపుతున్న విశ్వాసం తమకెంతో ఆనందాన్నిస్తోందని మంత్రి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో ప్రజలను ఇంతగా మెప్పించింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి అవినీతి లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించి, ప్రజలు మరింత మెరుగైన జీవితం కోసం బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. అంతకు ముందు గ్రామాల్లో రూ.10.30 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను, రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గొలగాం సర్పంచ్ శెలపురెడ్డి నరసింగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మిందిఅచ్యుతరామ్, సూరి అప్పారావు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పసల మారమ్మ ఉత్సవం



కశింకోటలోని కనకమహాలక్ష్మి వీధిలో పసల మారమ్మ ఉత్సవ ఊరేగింపు

కశింకోట: స్థానిక కనక మహాలక్ష్మి వీధిలో పసల మారమ్మ ఉత్సవాన్ని గురువారం రైతులు, మహిళలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీర, రవికెలు, పండ్లు, పలహారాలు వగైరా పళ్లాల్లో వేసి, తలపై పెట్టుకుని మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని పొలాల్లో ఉన్న అమ్మవారి గుడి వద్ద పూజలు నిర్వహించారు. పశువులు, మనుషులకు విష సర్పాల వల్ల ఎటువంటి హాని జరగకుండా కాపాడమ్మా అంటూ వేడుకున్నారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. కనకమహాలక్ష్మి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు స్థానిక మరిడిమాంబ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు.

జూనోటిక్ వ్యాధుల పట్ల అప్రమత్తం



నరసింగబిల్లి పశు వైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలను పరిశీలిస్తున్న వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట: కుక్క కాటు వల్ల మనుషులకు రేబిస్ వ్యాధి వ్యాపించి, ప్రాణాంతకంగా మారుతుందని, జాగ్రత్తగా ఉండాలని కశింకోట పశు వైద్యాధికారి అల్ఫాన్సో జార్జ్ అన్నారు. మండలంలోని మూడు పశు వైద్య కేంద్రాల్లో గురువారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించి 64 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చి కుక్క లాలాజలంలో రేబిస్ కారక వైరస్ ఉంటుందని, అది కరచిన వెంటనే మెదడుకు వ్యాపించి మనిషి మరణానికి కారణమయ్యే అవకాశం ఉందన్నారు. కుక్క కరచిన నెల లోపు 5 మోతాదుల వ్యాక్సిన్ వేసుకోవాలన్నారు. జంతువుల వల్ల మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధుల పట్ల అవగాహన ఉంటే ఎలాంటి సమస్య ఉత్పన్నం కాదన్నారు. మండలంలోని నరసింగబిల్లి, కన్నూరుపాలెం పశు వైద్య కేంద్రాల్లో కూడా జూనోసిస్ దినోత్సవం పురస్కరించుకుని పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమాల్లో నరసింగబిల్లి, కన్నూరుపాలెం పశు వైద్యాధికారులు చైతన్యమణి, దయానా, వెటర్నరీ అసిస్టెంట్లు అశ్విని, రూపవతి, రాజేష్, స్కూల్ కమిటీ అధ్యక్షుడు సేనాపతి లక్ష్మి బాబూరావు, నరసింగబిల్లి సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



నరసింగబిల్లి నుంచి కంటి ఆపరేషన్లకు బస్సులో బయలు దేరడానికి సిద్ధంగా ఉన్న రోగులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 42 మంది హాజరు కాగా, వారిలో 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ, ఆప్తాలమిక్ అధికారి వరహాలు, క్యాంపు కోఆర్డినేటర్ అశ్వనీకుమార్, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అజయ్‌బాబు, మధుబాబు

తుమ్మపాల: బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి టి.అజయ్‌బాబు, జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబులు మాట్లాడుతూ అణగారిన వర్గాల తరపున గాంధీజీతో కలిసి స్వాతంత్ర ఉద్యమంలో పోరాడి, స్వతంత్ర భారత దేశం మొట్టమొదటి కేబినెట్‌లో మంత్రి నుంచి ఉప ప్రధానిగా ఆయన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ఉన్నత సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ(ఎస్డీవో) సభ్యుడు బొడ్డేడ అప్పారావు, కార్యాలయ సూపరింటెండెంట్ శామ్యూల్, ఎస్‌డబ్ల్యూవోలు సత్యవతి, జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

అట్టడుగు వర్గంలో జన్మించిన బాబు జగ్జీవన్ రామ్ భారత ఉప ప్రధానిగా దేశానికి ఎంతగానో సేవలందించారని ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లి చినఅప్పారావు, కట్టు మూరి మంగరాజు, నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షుడు నెల్లి గురుదేవ్ కొనియాడారు. పట్టణంలోని చోడవరం బస్‌స్టాప్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా 40 ఏళ్ల పాటు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ అట్రాసిటీ మోనటరింగ్ కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పారావు, ఎన్ఎస్ఎఫ్‌జే జిల్లా ప్రధాన కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు, చెవ్వేటి నాగరాజు, నల్లమటి కొండలరావు, పెట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



బీజేపీ పట్టణ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

తుమ్మపాల: పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొణతాల శివకుమార్, గండి వెంకట సత్యనారాయణ విచ్చేసి ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాశ్మీర్ కోసం న్యాయపోరాటం చేసి, బలిదానం చేసిన గొప్ప వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు, బీజేవైఎం జిల్లా ప్రెసిడెంట్ వి.నర్సింగ్‌యాదవ్, అసెంబ్లీ కోకన్వీనర్ కసిరెడ్డి శ్రీను, కొడుకుల వెంకటరావు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

అనకాపల్లిటౌన్: మండలంలోని సీహెచ్‌ఎన్ అగ్రహారంలో గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. సర్పంచ్ కొల్లిమల్లి గోవిందరావు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి గ్రామ ప్రజలతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సబ్బవరం : మండలంలోని సెక్షన్ – 1, 2 పరిధిలోని 33 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరా నిలిపేయనున్నట్టు పేర్కొన్నారు.

బదిలీపై వెళ్లిన పోలీసులకు సన్మానం



పోలీసులను సత్కరిస్తున్న సీఐ రంగనాథం, స్టేషన్ సిబ్బంది

సబ్బవరం: ఇటీవల బదిలీపై వెళ్లిన పోలీసు సిబ్బంది వీడ్కోలు కార్యక్రమం సబ్బవరంలోని ముత్యం కల్యాణ మండపంలో గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సీఐ రంగనాథం మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా పారదర్శకంగా సేవలందించే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల మనసులో స్థానం ఉంటుందన్నారు. సబ్బవరం పోలీస్ స్టేషన్ నుంచి పలు స్టేషన్లకు బదిలీపై వెళ్లిన హెచ్‌సీలు మల్లేశ్వరరావు, పి.వి.రమణ, కె.కిశోర్, పీసీలు బి.డి.నాయుడు, పి.శివ కృష్ణ, పి.గౌతమ్, సిహెచ్.శ్రీను, ఎల్.శకుంతలకు సీఐ జ్ఞాపికలు అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఎల్.సురేష్, సత్యనారాయణ, హెచ్‌సీ కె.టి.ఎన్.శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.